


# కళాకారుడు ★

రచన :
కె. ఎ. సత్యనారాయణ

ఆరోజు విజయదశమి ఊరంతా వుత్సవాలతో ఆనంద డోలికలలో వూగుతూంది. బడిపిల్లలు గిలకలు పట్టుకొని వుపాధ్యాయులవెంట యింటింటికి తిరిగి పప్పుబెల్లాలకోసం తాపత్రయపడుతున్నారు.

క్రమంగా చీకటిపడుతుంది. విద్యుద్దీపాలతో వూరంతా కళకళలాడుతుంది. ఏ వీధిన ఏ పందిరిచూసినా ఏదో ఒక వైజ్ఞానిక ప్రదర్శనాలతో రోడ్లు అన్నీ జనసమ్మర్దంతో కిటకిటలాడుతున్నాయి. ప్రజలు ఒకపందిరినుండి యింకొక పందిరికి, అపందిరినుండి యీపందిరికి, పెద్దపెద్ద అరుపులతో,కేకలు పెట్టుకుంటూ గుంపులు గుంపులుగా వెళ్తున్నారు. యీ గుంపులలో ఆడవాళ్లు పిల్లలను చంకను ఎత్తుకొని, వుత్సవాలు చూడటానికి వస్తున్నారు. వీరిలో యువతులు కొందరు, ఆ యువతుల వెంట యువకులు కొందరు. యీ వుధంగా ఆ వూరు కళకళలాడుతూంది.

ఒక పందిరిలో భోగంమేళం. ఒక పందిరిలో బుర్రకథ. ఒక పందిరిలో నాటకం. యింకొక పందిరిలో గానసభ. యింకొక పందిరిలో డ్యాన్సుప్రోగ్రామ్సు. అవూరిలోవుండే ప్రజలేకాదు, చుట్టు పల్లెటూళ్ళనుండికూడా యీప్రోగ్రామ్సు చూడటానికి ప్రజలు గుంపులుగావచ్చి యీ ప్రదర్శనాలు చూస్తున్నారు. వూరంతా పోలీసు బందోబస్తు చేశారు. ప్రతి ప్రదర్శనంవద్ద పోలీసులు కాపలావుండి వచ్చేజనాన్ని సర్దుతున్నారు. ఒక్కొక్క ప్రదర్శనందగ్గర చిన్నచిన్న గలాటాలు జరుగుతున్నాయి. పోలీసులు వాటిని అణచటానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా మేజువాణీవద్ద, డ్యాన్సు ప్రోగ్రామువద్ద కుర్రవాళ్ల అల్లరిని అణచటానికి పోలీసుపడ్డ పాట్లు చెప్పటానికి వీల్లేదు. మిగడా ప్రోగ్రామ్సు ప్రశాంతంగానే జరుగుతున్నాయి.

ఒక పందిరిలో 'కళాకారుడు' అనే నాటకం జరుగుతూంది. జనం కిక్కిరిసి వున్నా ప్రశాంతంగానే వుంది. నాటకం ఆఖరి ఘట్టంలోవుంది. కథక్లయ్ మాక్సులు పోతోంది. ప్రేక్షకులలో ఆలజడి, ఆతృత, ఆవేశం ఎక్కువౌతుంది.

అంతలో స్టేజిపైన ఒక హీరో అతని భార్యను కాల్చి చంపటానికి పిస్టలు గురిపెట్టేడు. భార్యను తనదారికి అడ్డులెమ్మని హెచ్చరిక చేస్తున్నాడు. ఆమె అడ్డు లేవనంటుంది.

“అయిన రెండెకరాలు అమ్మేసి, చివరకు నా వంటిమీదవున్న మంగళ సూత్రాలను కూడా యీనాటకాలు పేరు చెప్పి అమ్మటానికి సిద్ధపడ్డారు. నా మాటవినండి. మిమ్ములను బ్రతిమాలుతున్నాను. నా జీవితాన్ని నాశనంచేసి, మీ జీవితాన్ని కూడా సర్వనాశనం చేసుకోకండి. యికనైనా యీ నాటకాలు మానేయండి,” అమె కంఠం వణుకుతుంది. ఆమె కంటినుండి అశ్రుకణాలు బొటబొట రాలుతున్నాయ్.

“సరూ, నీవు నా అర్ధాంగివి” కావచ్చు. కానీ నా అభిప్రాయాలకు, అభిరుచులకు నీవు ఎప్పుడూ అడ్డు రాకు,” అతను ఆమెను నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు.

“అయితే మీరు యీనాటకాలు మాపనంటారా.”

“నాకంఠంలో ప్రాణంవుండగా ఆ పని జరుగదు. నా జీవితం యీ నాటక కళకు ఎప్పుడో సమర్పించాను.”

“అంతేనంటారా.”


“అంతే”

“అయితే నేను బ్రతికుండగా మిమ్ములను నాటకాలు వెయ్యనివ్వను” ఆమె మొఖంలో తెగింపు, గాంభీర్యం గోచరించాయ్.

“సరోజా, అనవసరంగా నా దారికి అడ్డు వస్తున్నావు. నాటక కళకోసం, యీ పవిత్రనాటక కళకోసం ఎటువంటి త్యాగానికైనా వెనుదీయనని నీకు ముందే హెచ్చరిక చేశాను నాదారికి అడ్డులే” అతను పిస్టలు చూపించి హెచ్చరిక చేశాడు. ఒక్కసారి కాదు, రెండుసార్లు కాదు నాలుగుసార్లు హెచ్చరికచేశాడు. యింకా చేస్తున్నాడు.

“ఆగండి, ఆగండి, కాల్చకండి. సర్వనాశనమైపోతారు.” అని కేకలు

వేసుకుంటూ ప్రేక్షకుల మధ్యనుండి లేచి ఒక వ్యక్తి జనాన్ని తప్పించు కుంటూ స్టేజీవైపు వెళ్ళసాగాడు. జనం అంతా గొల్లుమన్నారు. ఆ వ్యక్తిని ఆప టానికి ప్రయత్నించారు, కానీ అతని లోని ఆవేశం, ఆవేదన విశక్తి అతన్ని ఆపుచేయలేక పోతున్నాయి. ఎలాగై తేనేం అతన్ని పట్టుకొని ప్రజల మధ్య నుండి బయటకు తీసుకొని వచ్చారు. అతను స్పృహతప్పి పడిపోయాడు. శరీరంనిండా చెమటలు పట్టేయతనికి.



వళ్లంతా కంపించిపోతోంది. శరీరం వేడిగావుంది. అతన్ని చూసి పిచ్చివాడని కొందరు హేళనచేసారు. నాటకంలో ఆఘట్టం అతనికి నిజంగా భయంకలి గించి, ఆవేశం పట్టలేకపోయాడని కొందరు, తలకొకమాట చెప్పుకుంటూ ఎవరిదారీన వాళ్లు వెళ్లిపోయారు.

మానవులు రాక్షసులు కారు. దయార్ద్రహృదయులు వుంటారు.' దిక్కు లేనివారికి దేవుడే దిక్కు' అన్నట్లు ఆ వూరిలో ఒక పెద్దమనిషికి అతని స్థితిని చూసి చాలా జాలివేసింది. మాసిపోయి, చిరిగిపోయిన బట్టలు, పెరిగి పోయిన గడ్డం, ఎర్రగా మారి పీచుగట్టిన అతని శిరోజాలు, అతని కళ్లనుండి కారుతున్న అశ్రుకణాలు, ఆ వచ్చిన పెద్దమనిషి హృదయాన్ని కలవరపెట్టాయి. ఆ పెద్ద మనిషి యితన్ని చూడగానే ఏదో జ్ఞాపకంవచ్చినట్లు బాధపడ్డాడు. ఇతన్ని ఎక్కడో చూసినట్లు అతనికి జ్ఞాపకం. కానీ అది గుర్తుకు రావటంలేదు. అంతే కాదు, యితనితో పరిచయ మున్నట్లు కూడా అతను బాధపడ్డాడు. ఆ పెద్ద మనిషి హృదయం కరిగి, యితని చరిత్ర తెలుసుకోవాలని తనయింటికి తీసుకొని వెళ్లి, ఆ రాత్రికి ఆశ్రమిచ్చాడు. అప్ప టికే రాత్రి రెండుగంటలు దాటింది. కానీ అతనికి తెలివిరాలేదు.

తెల్లవారింది. ఆ పెద్దమనిషి యితని గదిలోకి వచ్చాడు. అంతలో అతను కూడా లేచాడు. అతనికి ఏమీ తోచటం లేదు. యీగదిలోకి ఎలావచ్చానా అని ఆలోచిస్తున్నాడు. యింతలో తన గది లోకివచ్చిన పెద్దమనిషినిచూసి ఆగి పోయాడు.

"ఎవరండీ మీరు"

"నే నెవరైతే నీ కెందుకు నాయనా; అపదలో నున్న నిన్ను యిక్కడకు తీసు కొని వచ్చాను."

"అందుకు నా హృదయపూర్వక నమస్కారాలు. కానీ, నన్ను......ఈ స్థితిలోనున్న నన్ను మీయింటికి తీసు కొనివచ్చి ఆదరించారు. మిమ్ములను గురించి తెలుసుకునేభాగ్యం, యీ దరి ద్రుడికి కలుగజేయండి దయచేసి సెల విప్పండి."

"యీ వూరు చైర్మన్ని. పేరు వెంకటపతి. నిన్నరాత్రి నాటక పంది రిలో నీవు స్పృహతప్పి పడిపోయావు. జ్ఞాపకముందా నాయనా. ఆసమయంలో నీ స్థితిచూసి నేను చాలా బాధపడ్డాను. యింటికి తీసుకొనివచ్చాను. కానీ ఒక్క మాట. నీవు నాటకం జరుగుతున్న సమయంలో 'చంపకండీ, నాశనమై పోతారు' అని కేకలువేసుకుంటూ స్టేజీ దగ్గరకు జనాన్ని త్రోసుకుంటూ వెళ్లేవు. దానికి కారణం తెలుసుకోవచ్చా. దాని వెనుక ఏదో బలవత్తరమైన సంఘర్షణ వుందని, అది తెలుసుకోవాలని నా మనస్సు కలవరపెడుతుంది. నీ వెవ రవు. యీ స్థితి నీ కెలా సంభవించింది. చేతనైన సహాయం నేను చేస్తాను చెప్పు."

"ఏమి చెప్పమంటారు చైర్మన్ గారు. నేను ఒక అభాగ్యుడ్ని. దిక్కు లేనివాడిని. నాజీవితగాథ చెప్పి, మీమన స్సును బాధపెట్టడం నా కిష్టంలేదు. నా జీవితంలో జరిగిన విషాదఘట్టం, ఏ మానవునికి, ఎప్పుడు సంభవించి వుండదు. నా జీవితం యీవిధంగా అవు తుందని ఎవ్వరూ వూహించలేదండీ...

చైర్మన్‌గారు" అతని కళ్ళవెంట నీళ్లు కారాయి.

"యింతకు మీది ఏవూరు"" చైర్ గారు కళ్లవెంట వస్తున్న నీటిని కండువాతో అద్దుకొన్నారు.

"విజయవాడండీ"

"మరి మీపేరు"

"రామనాథం"

"మరి మీరు యీ రాజమండ్రి రావటానికి కారణం"

"నామతి చెలించి, నా అనేవాళ్లు లేక, యీ పవిత్ర గోదావరితల్లి వడిలో తలదాచుకుందామని బికారినై ఇప్పటి వరకు తిరిగాను నా 'శశి' కోసం"

"అ...శశి ఎవరు?"

"నా భార్య"

"ఎవరితోనైనా లేచిపోయిందా?"

"లేదు. అ పవిత్ర ప్రణమూర్తిని. నా నోటితో అటువంటిమాటలు పలికి అమె ఆత్మకు అపవిత్రం చెయ్యలేను."

"అయితే ఏమైంది."

"నాభార్య... నాభార్య..." అతని కళ్ళవెంట నీరు గిర్రున తిరిగాయ్.

"పరవాలేదు. నీజీవితచరిత్ర తెలుసుకోవాలని, నీ జీవితానికి వెలుగుబాట చూపించటానికే యిక్కడకు నిన్ను తీసుకొనివచ్చాను. మానవుడనై పుట్టినతరువాత, నీలాంటి ఒక వ్యక్తి జీవితానికైనా, నా జీవితంలో దారి చూపించగలిగితే నేను ఎంతో అదృష్టవంతుణ్ని. నీ జీవిత సంఘటనలు చెప్పు..."

"అది ఒక భయంకర సంఘటన చైర్మన్‌గారు. తలచుతుంటుంటే నా హృదయం కుమిలిపోతోంది. యిరవై సంవత్సరాలక్రితం సంగతి. నేను ఒక కవిని. నాటకాలు వ్రాయటం అ నాటకాలు ప్రదర్శించి సంఘ మరమ్మతుకు, దేశ సౌభాగ్యానికి పాటుపడటం నా ఆశయం. నా జీవితం యీ నాటక కళ కోసం అంకితం చేద్దామని నా నిర్ణయం కూడా. నాభార్య అందుకు వ్యతిరేకం. పెళ్లిసమయంలో నా మామగారు కట్నంగా వ్రాసియిచ్చిన అయిదు ఏకరాల భూమి అమ్మేసింది కాకుండా నా భార్య మంగళసూత్రాలనుకూడా అమ్మటానికి సిద్ధపడ్డాను యీ నాటక కళ కోసం. నా భార్య యిందుకు ఒర్చుకోలేకపోయేది. మధ్యమధ్య యింటిలో చిన్నచిన్న సంఘర్షనలు తలయెత్తుతుండేవి. అయినా నాహృదయం చెలించలేదు. నా కుటుంబం సర్వ నాశనమైనా సరే, నేనూ, నా జీవితం యీ పవిత్ర నాటక కళకే సేవచేయాలని నిశ్చయించుకొన్నాను. మా నాటక సమాజంలో యింకా అరుగురు సభ్యులు కూడా వుండేవారు. నాతోపాటు వాళ్ళు కూడా వారికున్న అస్తులను యీ నాటక కళకోసం ఖర్చుపెట్టి కళాసేవ చేసేవారు.

ఒక రోజున నేను నాటకప్రదర్శనానికి యింట్లోనుండి ప్రయాణమయ్యాను. నా భార్య అడ్డువచ్చింది. ఆరోజు నా భార్య తీరు, తెన్ను ఏరోజునా నేను చూడలేదు. నా భార్య గాంభీర్యంచూసి నేనె భయపడిపోయాను. కానీ నాటక కళకోసం త్యాగం చేయదలచుకొన్న నేను, నా మనస్సును నిగ్రహపరచుకొన్నాను, నా భార్య నన్ను నాటకానికి వెళ్లవద్దంది. కానీ, ఎటువంటి పరిస్థితులలోను యీ పవిత్ర నాటక కళను విడిచిపెట్టేది లేదని, నా దారికి అడ్డుతొలగమని నేను నా భార్యను హెచ్చరికచేశాను. కానీ అమె నా హెచ్చరికను వినిపించుకోలేదు. సంఘర్షణ ఎక్కువయింది. యింతలో మా సమాజంవాళ్ళు కూడా అక్కడికి వచ్చేరు. వారినిచూసి నాలో వుడుకుమోతుతనం, అవేశం, అగ్రహం ఎక్కువయింది. డ్రాయరులో వున్న పిస్టలు తీశాను. దారి తొలగమని నా భార్యకు తుది హెచ్చరికచేసి అమె వక్షస్థలానికి నా పిస్టలు గురిపెట్టేను. కానీ నా భార్య అ పిస్టలు నాటకంకోసం తెచ్చిన దీపావళి పిస్టలు అనుకొని అమాయకంగా నన్ను వ్యతిరేకించింది.

నేను అమెతో అ విషయం స్పష్టంగా చెప్పేను. యిది దీపావళిపిస్టలు కాదని, యిది నిజమైన పిస్టలు అనీ, అనవసరంగా నా దారికి అడ్డువచ్చి, అమె ప్రాణాన్ని బలిచేసుకోవద్దని హెచ్చరిక చేశాను.

కానీ నా జీవితం తారుమారయ్యే రోజులు సమీపించాయి. శని దేవత నా నెత్తిన నాట్యంచేస్తుంది. నాపిస్టలుగుండు అప్రయత్నంగా అమె పొత్తికడుపులో దూసుకుపోయింది. ఒకటికాదు, రెండు గుళ్ళు రక్తం 'చుయ్' మనీ చిమ్మింది. ఒక్క కేకతో నాశశి క్రిందపడి ప్రాణాలు పోగొట్టుకొంది. మా యింటికివచ్చిన నా అనుచరులు భయంతో వళ్లు తెలియక కేకలుపెట్టి, బయటకు లోపలికి పరుగు లెట్టేరు. అందులో ఒకతను యీసంఘటనచూసి మూర్ఛపోయాడుకూడ.

'నేను పాపిని. హంతకుడిని. తను నమ్మిన ఆశయాలు నెరవేరటానికి భార్యనుకూడా లెక్కచేయక హతమార్చిన పరమ కిరాతకుడిని. నాకు యీలోకంలో జీవించటానికి అర్హత లేదు. నా పవిత్రమైన నాటక కళకోసం జీవితాన్ని సర్వ నాశనం చేసుకునే నాలాంటి మూర్ఖుడు, మూఢుడు యీ లోకంలో వుండడు.' యీ విధంగా ఏవో తలపులు నామెదడును అవరించాయ్.

నాతల తిరిగిపోయింది. శరీరం కంపించింది. ముఖంపై చెమటలు

పట్టాయి. కాళ్ళు వణకసాగాయ్. శరీరంలో నరాలు పటుత్వం తప్పాయి. యింతలో బయటనుండి పోలీసుల విజిల్సు వినిపించాయి. నా గుండె అదిరిపోయింది.

'అవును హత్యచేశావు. నీవు హంతకుడివి. ఖూనీ కోరువి. నిన్ను పోలీసులు పట్టుకుంటారు. నిన్ను న్యాయస్థానం శిక్షిస్తుంది. నీకు మరణశిక్ష. నీ పవిత్ర నాటక కళకే మరణశిక్ష. నీ జీవితం యింతటితో సమాప్తి! నా అంతరాత్మ నన్ను యీ విధంగా ఘోషించి పలికింది.


నేను హత్యచేసినమాట వాస్తవమే. నాటక కళకోసం భార్యను చంపేననే అపకీర్తి యీ చెవులతో నేను వినలేను. ఎక్కడికైనా పారిపోయి తలదాచుకుందామని ప్రయత్నించాను. కానీ పోలీసులు పట్టుకున్నారు. కోర్టులో హాజరు పరచారు. కానీ నేను నిస్సహాయుడ్ని. భగవంతుని దయవల్ల నాకు ఉరిశిక్ష తప్పింది. యిరవై సంవత్సరాలు కారాగారవాసం విధించారు. నిన్ననే జైలునుండి విడుదల అయ్యాను. జైలులో నా జీవితాన్ని ఒక నాటక రూపంలో వ్రాశాను, అవి కొన్ని పత్రికలు ప్రచురించాయి. నిన్న ప్రదర్శించిన నాటకం అదే. అందుకే అదిచూసి నా పూర్వ స్మృతులు జ్ఞాపకం వచ్చి, నన్ను ఆవేశపరచాయి" అతని కంటి నుండి అశ్రుకణాలు బొటబొటా రాలాయి.

చేర్మన్‌గారి కంటివెంటకూడా నీళ్లు గిర్రున తిరిగాయ్. ఒక్కసారిగా అతను కవిగారి పాదాలపై పడ్డాడు. కవిగారూ! క్షమించండి. నేను ఎంతో అదృష్టవంతుడిని. మీసమాజంలో నేనుకూడా ఒక సభ్యుడనే. నన్నుగుర్తుపట్టేరా కవిగారూ! ఆ రోజున మీ భార్యను కాల్చి చంపిన తర్వాత పోలీసులు మిమ్మలను అరెస్టుచేసి కష్టడీలోకి తీసుకొన్నారు. ఆ పోలీసు కష్టడీలోనుండి జామీనుయిచ్చి విడుదలచేసిన వెంకటపతిని నేనే కవిగారూ! అనుకోకుండా అదృష్టవశాత్తు పెద్దలు సంపాదించిన యీ ఆస్తికి వారసుడనై, యీ చేర్మన్ పదవికి అర్హుడనైయ్యాను. యీ రోజున మిమ్ములను మరల చూడగలిగాను. కవిగారు నేను మీకు ఎంతో ఋణపడివున్నాను. మాయింటిలోనే వుండిపొండి కవిగారు.

'ఆ, ఎంతమాట వెంకటపతిగారు. చైర్మన్‌గారు ఒక హంతకుడిని యింట్లో పెట్టుకున్నారనే అపకీర్తి నావల్ల మీకెందుకు. మీరు నాకుచేసిన సహాయానికి కృతజ్ఞుడను. నన్ను వెళ్లనివ్వండి.'

'అలా వీల్లేదు కవిగారు. ఎప్పుడో యిరవై సంవత్సరాలక్రితం, అప్పుడు వుండే పరిస్థితులకు, వాతావరణానికి లొంగి, దైవం ఆ విధంగా మీచేత చేయించింది.' దానికి శిక్ష అనుభవించి, పరివర్తన చెందడంగూడా జరిగింది. తప్పక నామాటకు అడ్డురాకండీ కవిగారు. మా యింటిలోనే వుండండి.

'కవి పట్టరాని సంతోషంతో' చైర్మన్‌గారూ, మీలాంటి వుదార స్వభావులు మనదేశంలో గ్రామగ్రామానికి ఒక్కరున్నా, దేశం ఎంతో ముందుకు వచ్చి బాగుపడేది. కానీ మన పవిత్ర భారతదేశం అందుకు నోచుకోలేదు. కవి ఆనందబాష్పాలతో వెంకటపతిగారిని కౌగలించుకున్నాడు. ★



# ఉత్తముండ - పాతకుండ

రచన: "తెశరావ్."

ఉద్యోగరీత్యా - ఉత్సాహంతో ఉరకలువేస్తూ ఉరవకొండ చేరుకున్నాను. మాఫ్రెండు హనుమంతు S. E. O. గా బ్లాకులో పనిచేయడంచేత నేరుగా - జోరుగా వెళ్లి అతని రూములో బైఠాయించాను. తీరిక సమయాల్లో "ఆకాశవాణి" తో కాలక్షేపంచేసేవాళ్లము. ఆ నాడు క్రిస్‌మస్-ఆఫీసుకు సెలవగుటచే "రేడియో"తో రెడీగా కూర్చున్నాము. అంతలోనే అర్జంట్ టపాల్ వ్రాసేదుందని ఆఫీసరు రమ్మని కబురుపెట్టగా వెళ్లాను నేను. మా ఆఫీసుకు అభిముఖంగా క్రైస్తవాలయముంది.

ఆనాడు ఆఫీసువాకిలి తెఱచి బయటి వరండాలో కుర్చీలువేసుకొని-కాగితాలు ముందుంచుకొని కూర్చున్నాము నేనూ, కోవర్కర్ రామకృష్ణ. ఇఁక ఆ చర్చి శుభ్రము గావింపబడి వివిధ సీతాకోక చిలుకలూ-బంభరములచే సంబరముగా అలంకృతమైంది.

అంతలోనే అంతా ప్రార్థనకై లేచి నిలబడ్డారు. పైన వేదికనుండి ప్రీచర్ ప్రార్థన ప్రారంభించాడు!— "ఓదేవా! నీవు వుత్తాముండవు... నేను పాతాకుండను." దానినే పునశ్చరణ చేసారంతా. ఆ మాటలు వినేసరికి నవ్వాగిందికాదు. పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వుకున్నాము. అలా నవ్వులప్రవాహములో వారి తతిమా ప్రార్థన కొట్టుకుపోయింది. కాని దానికి నిజమైన పాత మిలా వుండాలి. "ఓ దేవా! నివు ఉత్తముఁడవు (శ్రేష్ఠుఁడవు) నేను పాతకుఁడను (పాపిని)..." అంటే వారు అర్ధానుస్వారములను పూర్ణానుస్వారములుగా మార్చి "ఉత్తముండ-పాతకుండ" చేసి రసాభాస చేసారు. తెనుఁగు బాసను ఖూనీ చేయడంలో కిరస్తానీ వాళ్లకంటే హిందుస్థానీవాళ్లే నయమనిపిస్తుంది. ★